నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, గురువారం 26 సెప్టెంబర్ 2024 VIKARABAD



దోర్నాల్‌పల్లిలో మిల్లెట్స్ రైతులతో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

## చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

దోమ, సెప్టెంబర్ 25 : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి, బాస్‌పల్లి గ్రామాల్లో వాసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, ఆర్గానిక్ పత్తి పంటను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో దృఢత్వం రావాలంటే పూర్వ కాలంలో సాగు చేసే చిరు ధాన్యాల వైపు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు. సామలు, కొర్రలు, సజ్జలు, రాగులు, జొన్న తదితర పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ పంటలు సాగు చేసే రైతులను ఆదుకునేలా జిల్లా స్థాయిలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకురావాలన్నారు. అనంతరం బాస్‌పల్లిలోని పాఠశాలలో మధ్యాహ్నభోజన శాలను, తాగునీటి సదుపాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పురుషోత్తం, ఏవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో మహేశ్ బాబు, మాజీ సర్పంచ్ యాదయ్య, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.




వికారాబాద్ జిల్లోని పలు గ్రామాల్లో బుధవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురువడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మర్పల్లి నుంచి మోమిన్‌పేట వెళ్లే దారిలో సిరిపురం వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహించడంతో రెండు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి.




కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఏ టైంకు వస్తుందో.. ఏ టైంకి పోతుందో తెలియని దుస్థితి నెలకొన్నది. బుధవారం రిజిస్ట్రేషన్ల కోసం మాడ్గుల మండల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన జనం గంటలతరబడి నిరీక్షించడం కనిపించింది. విద్యుత్తు అధికారులకు ఫోన్ చేసినా స్పందించ లేదని ప్రజలు వాపోయారు. మండల తహసీల్దార్ రెండు నెలలుగా లేకపోవడం, డీటీ రాజశేఖర్ సెలవులో ఉండడంతో ఆర్డీవో కార్యాలయం నుంచి డీటీగా ప్రవీణ్ వచ్చి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

- మాడ్గుల



- కూల్చివేతకు సర్కారు రెడీ
- మూసీపైకి రానున్న హైడ్రా బుల్డోజర్లు
- కూల్చివేస్తామంటున్న అధికారులు..
- అడ్డుకుంటామంటున్న నివాసితులు

# 40 వేల ఇండ్లు మటాష్!

**మూసీ పరిసరాల్లో** సుమారు 40వేల ఇండ్లు చెదిరిపోనున్నాయి.. వందలాది కుటుంబాలు రోడ్డునపడనున్నాయి...ఇప్పుడు హైడ్రా బుల్డోజర్లు మూసీ నివాసాలపైకి విరుచుకుపడేందుకు సిద్ధం కావడంతో నిర్వాసితుల్లో కంటిమీద కునుకు కరువైంది. మూసీ వెంట కూల్చివేతలకు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు రాగా, రెండు, మూడు రోజుల్లో ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తున్న స్థానికులు.. తీవ్రంగా నిరసనలు తెలుపుతున్నారు. ఇప్పటికే కూల్చివేతలకు వ్యతిరేకంగా ఆందోళన, జీహెచ్ఎంసీ వద్ద ధర్నాలు చేశారు. తామంతా లేబర్లమంటూ.. దూరంగా తరలిస్తే..జీవనోపాధి దెబ్బ తింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైసా..పైసా..పోగుచేసుకొని..ఇండ్లు కట్టుకున్నామని.. కూల్చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. ప్రాణాలైనా ఇస్తాం.. హైడ్రా బుల్డోజర్లను రానివ్వమంటున్నారు. అయితే మూసీ నిర్వాసితుల నుంచి ఇంత వ్యతిరేకత వస్తున్నా.. ప్రభుత్వం మాత్రం కనికరం చూపకుండా కూల్చివేతలకే సిద్ధం కావడం గమనార్హం.

-సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ)

## గూడు..గోడు

### మా ఇండ్ల జోలికొస్తే ఖబడ్దార్

'ఉపాసం ఉండి డబ్బులు కూడబెట్టుకుని ఇల్లు కొనుక్కున్నాం. ఎన్నో ఏండ్ల నుంచి ఇక్కడి భూమితో పేగు బంధం మాది. మా ఇండ్లను కూలగొట్టే ప్రసక్తే లేదు. ఎట్లస్తరో చూస్తాం. కారం పొడులతో సిద్ధంగా ఉన్నాం. హైడ్రా మిషన్లను రానివ్వం. మాకు ఎలాంటి డబుల్ బెడ్రూంలు కూడా అవసరం లేదు. మాపై ప్రేమ ఉంటే.. మా ఇండ్లను విడిచిపెట్టి గోడ కట్టించండి. అంతేకానీ కూల్చేస్తే ఊరుకునేదే లేదు. చావడానికైనా సిద్ధమే. జైల్లో పెట్టినా వెళతాం. రూపాయి రూపాయి పోగు చేసుకొని ఇల్లు కట్టుకున్నాం. నగరం నుంచి మమ్మల్ని తరిమితే.. మా ఉపాధి ఏం కావాలి? మా పిల్లల స్కూల్ ఏం కావాలి? నిజంగానే మాపై ప్రేమ ఉంటే ఇక్కడే డబుల్ బెడ్రూం కట్టించండి. ఈ పోరాటంలో మేం శవాలైనా లెక్కచేయం. అన్ని అనుమతులు ఉన్నాయనే ఇండ్లు కట్టుకున్నాం. మా ప్రాణాలు తీస్కోండి. మూసీ వెంట ఉన్నది అందరం లేబర్లమే. మమ్మల్ని తీసుకొని ఎక్కడో వేస్తే ఏం చేస్కొని బతకాలే. డబుల్ బెడ్రూం అందజేసే ప్రక్రియకు నెలల తరబడి సమయం పడుతుంది. అంతవరకు మేము ఎక్కడ ఉండాలి. ఎక్కడో దూరంగా ఇండ్లు కేటాయిస్తే.. ఎలా బతకాలి'.. అంటూ.. మూసీ పరీవాహక ప్రాంత వాసులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇన్నేండ్లలో ఎప్పుడు ఇలాంటి మనసులేని సీఎంను చూడలేదని వాపోతున్నారు. రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పే రోజులు వస్తాయని హెచ్చరిస్తున్నారు.

### మొదలైన అలజడి..

మూసీ పరీవాహక ప్రాంతాల్లో అలజడి మొదలైంది. ఇన్నేండ్లు ఉన్న ఇల్లు ఇవ్వాల్లో రేపో కూలబోతుందేమో అనే ఆలోచన వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. నార్సింగి నుంచి నాగోల్ వరకు, ఆసిఫ్‌నగర్, అంబర్‌పేట, చార్మినార్, బహదూర్‌పుర, గోల్కొండ, హిమాయత్‌నగర్, నాంపల్లి, సైదాబాద్ పరిధిలో పెద్ద ఎత్తున నివాసాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, సరూర్ నగర్ , మేడ్చల్ ఉప్పల్, రామంతాపూర్, భగాయత్ తదితర ప్రాంతాల్లో కాలనీలు ఏర్పాటయ్యాయి. వీటిని తొలిగించాలంటే చాలా మంది రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందని సామాజికవేత్తలు, మేధావులు ఆందోళన చెందుతున్నారు. పునరావాసం కల్పించడమంటే కేవలం నివాసం ఇస్తే సరిపోదని.. వారి వ్యాపార, మనుగడను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

### పునరావాసం కల్పిస్తాం: దానకిశోర్

మూసీ సుందరీకరణలో భాగంగా మూసీ రివర్ బెడ్‌లోని ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన సుమారు 1600 నిర్మాణాలు సర్వే ద్వారా గుర్తించామని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దానకిశోర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్మాణాలను తొలిగించడానికి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఒక కార్యాచరణను రూపొందించామన్నారు. అందులో భాగంగానే సుమారు 15వేల డబుల్ బెడ్రూం ఇండ్లను మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్ లో నివసిస్తున్న కుటుంబాల పునరావాసానికి కేటాయిస్తామని వివరించారు.






- అధికారుల సర్వేలు.. ఆందోళనలో ప్రజలు
- రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 224 చెరువులు ఆక్రమణకు గురైనట్లు అధికారుల గుర్తింపు..

# చెరువుల చుట్టూ.. భయం..భయం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25 : నగరశివారుల్లో విస్తరించి ఉన్న రంగారెడ్డి జిల్లాపై హైడ్రా దృష్టి సారించింది. ఇప్పటికే హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో చెరువుల ఆక్రమణల పేరిట హైడ్రా అధికారులు పెద్ద ఎత్తున పేదల ఇండ్లను కూల్చివేయడంతో పాటు అనేక మందిని నిరాశ్రయులను చేసింది. హైదరాబాద్ అనంతరం రంగారెడ్డి జిల్లాను టార్గెట్‌గా ఎంచుకున్నది. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులతో జిల్లాలోని చెరువులెన్ని, ఆక్రమణలకు గురైన చెరువులు ఎన్ని.. అనేదానిపై నివేదిక తెప్పించుకున్నది. ఆక్రమణలకు గురైన వాటిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అతిపెద్దదైన ఇబ్రహీంపట్నం చెరువుతోతో పాటు తుర్కయాంజాల్ మాసాబ్ చెరువునూ అధికారులు పరిశీలించి ఆక్రమణలను గుర్తించారు. ఎప్పుడు హైడ్రా అధికారులు జిల్లాలో అడుగుపెడతారోనన్న భయాందోళనలో జిల్లా ప్రజలు ఉన్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలకు చెందిన జనం సొంత ఇండ్లను కొనుగోలు చేసి నివాసం ఉంటున్నారు. ఈ నియోజకవర్గాల్లోని చెరువుల పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు గతంలో ప్లాట్లు చేసి విక్రయించగా, పేదలు కొనుగోలు చేసి ఇండ్లను నిర్మించుకున్నారు. ఇప్పుడు ఆ ఇండ్లను కూల్చివేసేందుకు హైడ్రా అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

### జిల్లాలో 556 చెరువులు..

రంగారెడ్డి జిల్లాలో 556 చెరువులు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా చిన్న, పెద్ద చెరువులన్నీ కలిపి 701 ఉన్నాయి. అందులో 556 మాత్రమే పెద్ద చెరువులు ఉన్నాయి. 224 చెరువులు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇందులో పెద్దదైన ఇబ్రహీంపట్నం పెద్దచెరువుతో పాటు తుర్కయాంజాల్ మాసాబ్‌చెరువు, మహేశ్వరం నియోజకవర్గంలోని రావిరాల చెరువులతో పాటు బాలాపూర్, బడంగ్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్, నాదర్‌గుల్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, హయత్‌నగర్, శంషాబాద్, తదితర ప్రాంతాల్లో చెరువులు పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురైనట్లు తెలిసింది. ఈ నెలాఖరు వరకు ఆక్రమణలకు గురైన చెరువులు హైడ్రా అధికారులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించనున్నారు. గతంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చెరువులకు ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ జోన్లను ఏర్పాటు చేశారు. హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన ఎఫ్‌టీఎల్ లోపల బఫర్‌జోన్ లోపల చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

### ఆందోళనలో జిల్లావాసులు..

చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రా దృష్టి సారించడంతో జిల్లావాసులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా నగరశివారు ప్రాంతాల్లో ఉన్న చెరువు, కుంటల్లో పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురికావడంతో ఆ చెరువులపైనే అధికారులు దృష్టి సారించారు. నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున నగరశివారుల్లోని ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లను నిర్మించుకున్నారు. ఈ ఇండ్లన్నీ చాలా వరకు చెరువులు, కుంటల, పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. దీంతో తాము, గ్రామాల్లో ఉన్న భూములను అమ్ముకుని ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకున్నామని, అవి కోల్పోతే తమ పరిస్థితి ఏమిటని పేద ప్రజలు వాపోతున్నారు.



ఇబ్రహీంపట్నం పెద్దచెరువులో అక్రమంగా నిర్మించుకున్న ఇండ్లను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు (ఫైల్)

### ఇండ్లు కోల్పోతున్న వారికి పునరావాసం కల్పిస్తాం..



రంగారెడ్డి జిల్లాలో చెరువు, కుంటల్లో అక్రమంగా నిర్మించిన ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుంది. ఇబ్రహీంపట్నం చెరువును హైడ్రా అధికారులు పరిశీలించారు. చెరువు, కుంటల్లో అక్రమంగా నిర్మించిన ఇండ్లను కూల్చివేయనున్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇచ్చి న్యాయం చేస్తాం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

# ఆక్రమణదారులకు నచ్చజెప్పండి

**మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు**

**పరీవాహక ప్రాంతంలోని అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు**

**వివరాలు సేకరించాలని అధికారులకు ఆదేశం**

**అక్రమ నిర్మాణాల తొలగింపుపై జరిగిన సమీక్షలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

ఇబ్రహీంపట్నం రూరల్, సెప్టెంబర్ 25 : 'మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.. ఇండ్లు కోల్పోయే ఆక్రమణదారులకు నచ్చజెప్పండి..'.. అని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. బుధవారం రాజేంద్రనగర్ మండల రెవెన్యూ కార్యాలయంలోని మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి, అక్రమ నిర్మాణాల తొలగింపుపై సంబంధిత అధికారులతో రంగారెడ్డి కలెక్టర్ శశాంక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంతంలో ఇండ్లు కోల్పోయే పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయించేందుకు అర్హుల వివరాలను సేకరించాలన్నారు. జిల్లాలోని గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో 332 అక్రమ నిర్మాణాలను గుర్తించామన్నారు. ఈ నిర్మాణాలను తొలగించాల్సి ఉన్నందున వారికి మరోచోట డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. మొదటగా నాలుగు బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ టీముల్లో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, సర్వే డిపార్ట్‌మెంట్, ఇతర సిబ్బంది 8 నుంచి 10 మంది ఉంటారన్నారు. ఈ బృందాలు ఇంటి యజమానికి సంబంధించిన ఆధార్ కార్డు, ఇంటి పేపర్లు, కరెంట్ బిల్లు, అనుమతులు తదితర డాటాను సేకరించాలని సూచించారు. ఇప్పుడుంటున్న ఇండ్లకు వరద ముప్పు ఉన్నదని వారికి వివరించాలన్నారు. వీరికి ఇచ్చే డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు కోసం వారి చేతే డ్రా తీయిస్తామన్నారు. ఖాళీ చేయించే సమయంలో రవాణా ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. బృందాలు తమతమ పరిధుల్లోని ఆక్రమణదారులను పిలిచి నచ్చచెప్పాలన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివాసాలు కమర్షియల్ ఆక్రమణలు ఏ మేరకు ఉన్నాయో వివరాలు సేకరించాలన్నారు. పోలీసు శాఖ నుంచి సరైన సహకారం కల్పించాలని పోలీసు అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మూసీ డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ ఎండీ గౌతమి, డీసీపీ శ్రీనివాస్, రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, మూసీ రివర్స్ డెవలపర్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, రాజేంద్రనగర్ మున్సిపల్ కమిషనర్ రవికుమార్, నార్సింగ్ మున్సిపల్ అధికారులు, రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు, నాలుగు బృంధాల డిప్యూటీ తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక